


విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

దసరా సెలవుల్లో ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు సెలవులు ప్రకటించిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ విషయం తెలిసిన కూడా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని చెప్పారు. చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు అభివృద్ధికి గ్రహణం!





- బిజెపి ఎంపీ, ఎమ్మెల్యే మధ్య ఆధిపత్య పోరు
- మొన్న హైడ్రో..నిన్న ఆర్‌టిపిపి, తాజాగా గండికోట
- బిజెపి నేతల ఆగడాలతో అభివృద్ధి తిరోగమనం

జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి గ్రహణం పట్టింది. కడప జిల్లా పారిశ్రామిక, పర్యాటకాభివృద్ధికి జమ్మలమడుగు కీలక ప్రాంతం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జమ్మలమడుగు నుంచి తరుపున బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన సి.ఆదినారాయణరెడ్డి గెలిచారు. ఇదే నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల మండలానికి చెందిన సిఎం రమేష్ బిజెపి తరుపున అమలాపురం ఎంపీగా గెలిచిన సంగతి తెలిసిందే. బిజెపికి చెందిన సీనియర్ ప్రజాప్రతినిధులైన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ మధ్య ఆధిపత్య పోరు నెలకొనడం కడప జిల్లా, జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధికి శరాఘాతంగా మారిందనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా అభివృద్ధికి డబులింజిన్ సర్కారు డబుల్‌బ్రేకులు వేస్తోంది. బిజెపి ఎమ్మెల్యే, ఎంపీ మధ్య పరస్పరం విబేధాలు నెలకొనడంతో జమ్మలమడుగు వ్యవసాయం, నీటిపారుదల, పారిశ్రామిక, పర్యాటకాభివృద్ధి రంగాల్లో తిరుగులేని అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించింది. 2014 రాష్ట్ర విభజన చట్టంలో యుపిఎ సర్కారు పేర్కొన్న కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామనే హామీ అమలులో భాగంగా టిడిపి, వైసిపి సర్కార్ల హయాంలో జమ్మలమడుగు కేంద్రంలో శిలాఫలకాలు వేసిన సంగతి తెలిసిందే. జిల్లా ప్రగతి చరిత్రను తిరగరాసే చారిత్రాత్మకమైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం బిజెపి ప్రజాప్రతినిధులు పోరాటం చేయాల్సి ఉంది. పురోగామి పంథాను విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ్మలమడుగు నియోజకవర్గానికి కేటాయించిన పారిశ్రామిక, పర్యాటకాభివృద్ధి ప్రాజెక్టులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నుంచి పర్సెంటేజీలు రాలేదనే అక్కసుతో అడుగడుగునా దాడులు, దౌర్జన్యాలతో అడ్డుపడుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఆర్నెళ్ల కిందట కొండాపురం మండల పరిధిలో అదానీ సంస్థ ఆధ్వర్యంలోని హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు పనుల్ని సిఎం రమేష్‌కు చెందిన రిత్విక్ కాంట్రాక్టు సంస్థ చేపట్టిన సంగతి తెలిసిందే. హైడ్రో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు కార్యాలయంపై స్థానికులకు ఉద్యోగాలు అడగడానికి వెళ్లామనే పేరిట రాళ్ల దాడులు చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది.


రిలే నిరాహారదీక్షలు చేస్తున్న ఆర్‌టిపిపి ఉద్యోగులు, కార్మికులు (ఫైల్)

ఫలితంగా జమ్మలమడుగు ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన రెండు క్లీన్ ఎనర్జీ సంస్థలు తప్పుకోవడం అభివృద్ధికి శరాఘాతంగా మారింది. ఆర్‌టిపిపి బూడిద కాంట్రాక్టు వ్యవహారంపై టిడిపికి చెందిన తాడిపత్రి ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డితో ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి మధ్య ఘర్షణ నెలకొనడం తెలిసిందే. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ఆరా తీయడం, పిలిచి మందలించడం, చివరికి హెచ్చరించడం వరకు వెళ్లిన సంగతి అందరి దృష్టినీ ఆకర్షించింది. తాజాగా గండికోట పర్యాట కాభివృద్ధి కాంట్రాక్టు పనులు దక్కించుకున్న రిత్విక్ కాంట్రాక్టు సంస్థ కార్యాలయంపై గ్రామాభివృద్ధి పేరిట దాడులకు పాల్పడడం వంటి చేష్టలతో జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధిని నిర్వీర్యం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు అధికారంలోకి వస్తే అభివృద్ధి జెట్ స్పీడ్‌తో వెళ్తుందనే పేరుతో మోత మోగించారు. ఆచరణలోకి వస్తే రాష్ట్రంలోని టిడిపి, బిజెపి, జనసేన పార్టీలకు చెందిన కూటమి నాయకులు జిల్లా, జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధిని జెట్ స్పీడ్‌తో తిరోగమనబాట పట్టించడంలో పరస్పరం పోటీ పడుతుండడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్ హాలు లో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించార వ్యవసాయ అధికారులు, ఇఫ్కో(ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్) ప్రతినిధులు, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు వ్యవసాయంలో నూతన వ్యవసాయ పద్ధతులను అవలంభించాలన్నారు. సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదికత సాధించి రైతులకు లాభాలు వచ్చేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వేముల, వేంపల్లి, ఒంటిమిట్ట మండలాలలో ఇప్పటికే అరటిపంటల్లో ఈ పద్ధతిని అవలంభిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో దాదాపు 500 మంది రైతులు ఈ విధానాన్ని పాటిస్తూ మంచి క్వాలిటీ పంటను ఉత్పత్తి చేసి తమ ఉత్పత్తులను ఆ గ్రామంలోని విక్రయించేలాగా చర్యలు చేపట్టామని తెలిపారు. రైతులకు మార్కెట్ ధరలను అందుబాటులో తెచ్చి రైతులు మరింత లాభపడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉత్పత్తి అయ్యే అరటిపంటలను అంతర్జాతీయ మార్కెట్లోకి తీసుకెళ్లి అత్యధిక లాభాలు చేకూర్చే లాగా చర్యలు చేపట్టాలన్నారు. ముందుగా ఇఫ్కో ప్రతినిధులు సుస్థిర వ్యవసాయం కేంద్రం ప్రతినిధులు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను కలెక్టర్ వీక్షించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడి చంద్రా నాయక్,ఏపీ ఎం ఐ పి వెంకటేశ్వర్లు , నాబార్డ్ ఏజీఎం విజయ్ విహారి, లీడ్ బ్యాంకు మేనేజర్ జనార్ధన, వ్యవసాయ, మైక్రో ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

2 నాటికి స్మార్ట్ కిచెన్లను సిద్ధం చేయాలి

కడప : పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్లను మండలాల్లో అక్టోబర్ 2 నాటికి నిర్మాణాలను పూర్తి చేసి నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల పురోగతిపై జెసి అదితిసింగ్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా రూపుదిద్దుకోనున్న స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్మాణాలు అన్ని మండలాల్లో ఒకే డిజైన్‌తో ఉండాలని సూచించారు. షెడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసి, అన్ని పరికరాలను ఏర్పాటు చేసి ట్రయిల్ రన్ నిర్వహించాలని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

యుసిఐఎల్ సమస్యలను పరిష్కరించండి

యుసిఐఎల్‌లో సమస్యలను పరిష్కరించి, పర్యావరణ సహితంగా ప్రాజెక్టును నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో తుమ్మలపల్లి యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(యుసిఐఎల్) సమస్యలపై ప్రాజెక్టు అధికారులు, పులివెందుల డివిజన్ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుసిఐఎల్ ప్రాజెక్టులో ఎలాంటి భూ, ఇతర సమస్యలు తలెత్తకుండా పరిష్కరించాలని పులివెందుల ఆర్‌డిఒను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని పునరావాసం కోరుతున్న కె.కె,. కొట్టాల గ్రామాల ప్రజలు రైతులతో మాట్లాడి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలన్నారు. గతంలో ప్రాజెక్టు కోసం మంజూరైన భూములను త్వరతిగతిన వారికి అప్పజెప్పాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ, భద్రతాపరమైన అంశాల్లో ఎలాంటి అలసత్వం వహించారాదన్నారు. యురేనియం గనుల వల్ల పరిసర గ్రామాలు ప్రభావితం కాకుండా చూడాలన్నారు. యురేనియం ప్రాజెక్టు (టైలింగ్) వ్యర్థపదార్థాల నిల్వలు, స్టోరేజ్ సామర్థ్యం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించాలి

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సరఫరాలో నష్టాలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య అధికారులను ఆదేశించారు. ప్రజల సంతృప్తి స్థాయి కేవలం 59.53 మాత్రమే ఉందని ఇది ఆందోళనకరమని పేర్కొన్నారు. సంతృప్తికర స్థాయిలో ప్రజలకు విద్యుత్ సేవలు అందించాలని అన్నారు. సోలార్ రూఫ్ టాప్ ద్వారా గృహాలకు ఉచిత విద్యుత్ పొందే అవకాశం ఉందన్నారు. మంగళవారం కడపలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో కడప డివిజన్‌కు సంబంధించి కడప, వల్లూరు, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల అధికారులతో విద్యుత్ సేవల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. వినియోగదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ, వారి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కరించాలని సూచించారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పొందే అవకాశాన్ని వివరించారు. తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని, రూ.98 వేల వరకు సబ్సిడీ ప్రోత్సాహకాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లో వోల్టేజ్ సమస్యలు నివారించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలను అరికట్టి, నిరంతర నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలని సూచించారు. విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు దాడులు నిర్వహించి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు హరి సేవ్య నాయక్, రమణారెడ్డి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నంజనేయులు, ఎఇలు, జెఇలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ గురవయ్య

పని గంటల పెంపు తీర్మానాన్ని వెనక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో కార్మికుల పని గంటలను 8 నుంచి 13 గంటలకు పెంచుతూ శాసనసభ, శాసనమండలి చేసిన తీర్మానాలను ఉపసంహరించాలని సిపిఐ(యం) నగర కార్యదర్శి రామమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే కనీస వేతనాలను ప్రస్తుత ధరల కనుగుణంగా సవరించాలని తెలిపారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు పని గంటలు పెంచిందని పేర్కొన్నారు. కార్మికులకు నష్టదాయకంగా పని గంటలను, పని విస్తృతిని పెంచడం, ఓవర్ టైమ్ కాలాన్ని రెట్టింపు చేయడం, మహిళల చేత రాత్రిపూట పని వంటివి పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగించడానికేనని పేర్కొన్నారు. మహిళలకు సౌకర్యాలను, రక్షణను యాజమాన్యాలు కల్పించడం లేదని తెలిపారు. మహిళల చేత రాత్రిపూట కూడా పని చేయించుకోవడానికి యాజమాన్యాలు మరింత దోపిడీ చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం సరికాదని పేర్కొన్నారు. వైసిపి సభ్యులు అసెంబ్లీకి హాజరుకావడం లేదని, ప్రతిపక్ష పాత్ర నిర్వహించి ఇలాంటి చట్టాలను వ్యతిరేకించకుండా పాలక పార్టీకి పరోక్షంగా సహకరించడం సరి కాదని తెలిపారు. కౌన్సిల్‌లో కూడా వైసిపి వ్యతిరేకిస్తూనే కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసిందని పేర్కొన్నారు. పని గంటలు పెంపుకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని పేర్కొన్నారు.

పని గంటల పెంపును నిరసిస్తూ 26న పట్టణంలో ర్యాలీ

ప్రొద్దుటూరు : అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పని, మహిళలకు రాత్రిపూట పది గంటల వరకు పని చేయాలని తీసుకొచ్చిన జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిఒ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న విజయ్‌కుమార్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ చట్టాన్ని సవరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామం నందు మంగళవారం జిల్లా టిడిపి పార్లమెంటరీ అధికార ప్రతినిధి పి ముని శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తల్లి, తండ్రి లేని అనాథ పిల్లలకు కూడా రేషన్ కార్డుల సదుపాయం కల్పించిందన్నారు. గతంలో ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిందన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీ తో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ రహంతుల్లా, ఉప సర్పంచ్ నాగన్న, టిడిపి నాయకులు కృష్ణయ్య, డీలర్ శ్రీనివాసులు, ప్రభుత్వ అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రజల్లో ఔషధాల దుష్ప్రభావాలపై జాగ్రత్తలు ఎంతో అవసరమని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.జమున తెలియజేశారు. కడప ప్రభుత్వ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం వారు ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు ఫార్మక విజిలెన్స్ కార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని రామిరెడ్డి కళాశాల ఆఫ్ ఫార్మసీ, నర్సింగ్ కళాశాల, ఇతర విద్యాసంస్థల్లో ఔషధాల దుష్ప్రభావాల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో ముగింపు సందర్భంగా మంగళవారం కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలు జయపతి, ఫార్మకాలజీ శ్రీలలిత, పద్మావతిల బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ ఇన్‌ఛార్జి హెచ్‌ఒడి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మావతి, పీజీ విద్యార్థులు, వైద్య కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్

సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు, అసభ్యకర వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపుతామని ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. మహిళలు, బాలికలు, పలువురు అధికారులు, న్యాయ వ్యవస్థపై సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు నమోదు చేస్తామని తెలిపారు. పలు ఫిర్యాదులపై జిల్లాలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో మహిళలు, బాలికల పట్ల అసభ్యకరమైన రీతిలో పోస్టులు పెట్టినా, కులాలు, వర్గాలు, వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో సోషల్ మీడియా పోస్టులపై గట్టి నిఘా ఉంచామని, వాటిపై ఎప్పటికప్పుడూ మానిటరింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటపుడు ఆలోచించి పోస్ట్ చేయాలని సూచించారు. యువత సోషల్ మీడియాని మంచి కోసమే వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యకరమైన రీతిలో, వ్యక్తిగత దూషణలు, కామెంట్ బాక్స్‌లో అనుచితమైన వ్యాఖ్యలు చేయడం, పోస్టులు పెట్టినట్లు గుర్తిస్తే వెంటనే జిల్లా పోలీస్ శాఖ సోషల్ మీడియా ఫిర్యాదుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన kadapapolice socialmedia @gmail. com, వాట్సాప్ నంబర్ 9121100686కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఉపాధ్యాయులను వేధించడం సరికాదు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రయివేట్ విద్యా సంస్థలలో ఉపాధ్యాయులకు దసరా సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం డిఇఒ శంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ దసరా సెలవులులో కుటుంబాలతో సంతోషంగా గడపడానికి కూడా వీలు లేకుండా జిల్లా లోని విద్యా సంస్థల యాజమాన్యాలు సంబంధిత ఉపాధ్యాయులను వేధిస్తున్నారన్నారు. టీచింగ్ స్కిల్ డెవలప్మెంట్, వర్క్ షాప్, స్కూల్ వర్క్ పేరుతో పాఠశాలలకు తప్పనిసరిగా రావాలని హుకుం జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. నారాయణ, చైతన్య, జిఎంఆర్ వంటి విద్యా సంస్థలలో, జిల్లా వ్యాప్తంతగా పాఠశాలల యాజమాన్యాలు స్కూల్ కి రాకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. చాలీ చాలని జీతాలతో ఉపాధ్యాయులు వెట్టిచాకిరి చేస్తున్నారని చెప్పారు. సంబంధిత ఎంఇఒలు కూడా కొంతమంది ప్రయివేట్ పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు పెద్దన్న పాల్గొన్నారు.

నూతన నగర కమిటీని అభినందించిన శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర పార్టీ ఆమోదం మేరకు కడప నగర కమిటీని టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రకటించారు. నగర అధ్యక్షులుగా పఠాన్ మన్సూర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా ముక్కర సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా పసుపులేటి గౌతం కుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా బోనం వెంకటేశు (శిలాష్), బాబా ఫక్రుద్దీన్, పూర్ణచంద్రరావు, కార్యదర్శులుగా కోనేటి వెంకటేష్ ఆచారి, శ్రీనివాసులు, నరేష్, కోశాధికారిగా చంద్రశేఖర్ రెడ్డి నియమించారు. నూతన కమిటీని శ్రీనివాసరెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.



నూతన కమిటీ నాయకులను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చలు

- అన్ని డిమాండ్లు పరిష్కరిస్తామని నాయకులకు ఎస్ఇ హామీ

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం విద్యుత్ ఎస్ఇతో నగరంలోని విద్యుత్ భవనంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించారు. నాయకుల డిమాండ్లపై ఎస్ఇ స్పందంచారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లందరికీ పైడ్ హాలిడేస్ ఇస్తామని తెలిపారు. అన్ని డివిజనులకు బడ్జెట్ పంపమని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ లందరికీ ఐటిఐ విద్యార్హతలు ఉన్న వారి పేర్లు కోర్టుకు వెళ్లిన కార్మికులకు, కోర్టుకు పోకపోయినా లిస్టు తయారు చేసి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని సిఎండి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రొద్దుటూరు, మైదుకూరు డివిజన్, కడప, పులివెందుల సబ్ స్టేషన్ పరిధిలోని మోటర్లు బోర్లు కాంపౌండ్ వాల్ ఫినిషింగ్లు సేఫ్టీ మెటీరియల్స్ అన్నీ కూడా ఎస్టిమేషన్ వేసి తొందరగా పని అయ్యేటట్లు చేస్తానని పేర్కొన్నారు. కంట్రోల్ రూములు మైదుకూరు డివిజన్‌లోని ముత్తులూరుపాడు వరికుంట్ల కాలవకట్ట పని మొదలు పెడతామని చెప్పారు. పులివెందుల డివిజన్‌లోని ప్రతి కాంట్రాక్టు కార్మికునికి పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని ఇప్పటికే ఒకరికి ఇస్తున్నామని, మిగతా అందరికీ ఇస్తామని చెప్పారు. డి.అగ్రహారం నరసింహారెడ్డికి ఒక సంవత్సరం పాటు రావాల్సిన జీతం కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్ ఉండాలని సిఎండి కి లెటర్ పంపుతానని చెప్పారు. అక్టోబర్ మొదటి వారంలో అవగాహన సమావేశాలు పెట్టి ఇన్సూరెన్స్, జీతాలకు వ్యక్తిగత రుణాలు ఇప్పించాలని, ఇతర కార్డులు, కార్మికుడికి భద్రతగా ఇన్సూరెన్స్ చేయాలని కోరినట్లు నాయకులు తెలిపారు. ఎస్ఇ స్పందిస్తూ బ్యాంకు వారితో మాట్లాడి ఇప్పిస్తామని చెప్పారు. చర్చల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి.సి.కొండయ్య, పులివెందుల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, చంద్రమౌళి, ఫీల్డ్ అసిస్టెంట్ జిల్లా నాయకులు నబి రాయుడు, అధికారులు పర్సనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు, జె ఎ ఓ జగన్మోహన్ రెడ్డి చర్చల్లో పాల్గొన్నారు. అన్ని విషయాలు చర్చించి మీకు న్యాయం చేస్తామని చెప్పిన ఎస్ఇ వెంకట్ రమణ కి ధన్యవాదాలు తెలిపారు. సమస్యలు అక్టోబర్ 10వ తేదీ లోపు పరిష్కరించకపోతే సిఎం డి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు.

ఎస్‌పిని కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - కడప : వైఎస్ఆర్ కడప జిల్లాకు ఇటీవల ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన షెల్కే నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందన శుభాకాంక్షలు తెలిపారు. కడప నగరంలో ఎదురవుతున్న ప్రధాన సమస్యలపై ఈ సందర్భంగా వారు ఎస్‌పితో చర్చించారు. వారి వెంట కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, టిటిడి బోర్డు మాజీ సభ్యులు యానాదయ్య, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, జిల్లా ఈస్ట్ సోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు షఫీ, ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, ఫయాజ్, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడిని విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి గురించి విమర్శించే స్థాయి మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డికి లేదని టిడిపి కార్పొరేటర్లు హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, కె.సూర్యనారాయణ, జప్రుల్ల, నాయకులు సుదర్శన్ రెడ్డి, అండ్లూరి బాలకృష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, రాజశేఖర్ మాట్లాడుతూ కృష్ణారెడ్డి ఎమ్మెల్యే పైనా, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమన్నారు. ఎమ్మెల్యే, శ్రీనివాస్ రెడ్డిల దగ్గర అత్యంత లబ్ధి పొందిన ఆయన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సింగిల్ విండో సొసైటీ చైర్మన్ పదవికి రాజీనామా చేసి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్లు

దసరాకు డిఎలు ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న 4 విడతల డిఎలు విడుదల చేయాలని, మూడేళ్ల సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఎపిఎన్‌జిజిఒ నగర అధ్యక్షులు కుంభం చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని తెలిపారు. 12వ పిఆర్ సి కమిషన్ ను ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని తెలిపారు. ఉద్యోగుల అసంతృప్తిని తొలగించి అప్పుల బాధ నుంచి విముక్తి చేయాలని తెలిపారు.

విద్యార్థులకు నైతిక విలువలు అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ ప్రోగ్రాం ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కెఒఆర్ ఆడిటోరియంలో అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులకు వారి విద్యా ప్రయాణం ఎలా ఉండాలి, చదువుపై దృష్టి ఎలా పెట్టాలి, క్యాంపస్ వాతావరణం ఎలా ఉంటుంది వంటి విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు, భవిష్యత్తులో ఒక మంచి విద్యార్థి ఎలా ఎదగాలి అనే విషయాలపై ప్రేరణాత్మకంగా మాట్లాడారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ కొత్త ప్రయాణాన్ని ఆరంభించారు.ప్రతి డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ సభ్యులు తమ పరిచయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి ఎన్ ప్రసాద్, హెచ్ ఎస్ విభాగాధిపతి డాక్టర్ రామచంద్రరెడ్డి, కళాశాల కల్చరల్ హెడ్ డాక్టర్ వీర శంకర్, అధ్యాపకులు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి మధ్యాహ్నం సందర్శనలో భాగంగా కాగితాల పెంట 1, 2 సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రోజువారి అటెండెన్స్ పరిశీలించారు. గవర్నమెంట్ స్కీమ్స్ రిపోర్టులను అడిగి తెలుసుకున్నారు. భగత్‌సింగ్ పార్క్‌ను హార్టికల్చర్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో తనిఖీ చేశారు. పార్కులో లైటింగ్, గ్రీనరీను పెంచాలని అధికారులకు ఆదేశించారు. పార్క్‌లో వ్యర్థాలను త్వర త్వరగా తొలగించాలని అధికారులకు ఆదేశించారు. పరిసరాలను ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు.

బ్రహ్మచారిణి దేవిగా కడప శ్రీవిజయదుర్గాదేవి

ప్రజాశక్తి - కడప అర్బన్

శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం శ్రీ విజయదుర్గాదేవి బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో విశేష పూజలు, చండీహోమలు నిర్వహించారు. అమ్మవారికి వేకువజామున 18 విశేష కళాశాలలో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చక్కగా అలంకరించి భక్తులకు దర్శనాన్ని అందించారు. ఆలయ అర్చకులు శ్రీచక్ర మండపంలో నవావరణ శ్రీచక్రార్చన తదుపరి యగశాలలో చండీహోమ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం కావడంతో మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు రాహుకాల పూజ కార్యక్రమాన్ని పెద్దసంఖ్యలో మహిళలచే నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు విశేష పూజ కైంకర్యాలలో భాగంగా అమ్మవారికి సహస్రకలువ పూజ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారు బ్రహ్మచారిణి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి శ్రీ విజయదుర్గ మల్లికార్జునను సింహ వాహనంపై ఆలయ ప్రదక్షిణ చేశారు.



హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న సిఐ వంశీధర్

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి- ఖాజీపేట

ప్రయివేట్ హోటల్ నిర్వాహకులు, డాబా యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని సిఐ వంశీధర్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులను ఉద్దేశించి సిఐ మాట్లాడుతూ హోటల్, డాబాలలో మద్యం అమ్మకాలు సాగించడం కానీ, సేవించడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్దేశించిన సమయం వరకు మాత్రమే హోటళ్లు నిర్వహించుకోవాలని సమయం ముగిసిన తర్వాత కూడా నిర్వహిస్తే ఉపేక్షించేది ఉండదని హెచ్చరించారు. హైవే వెంబడి ఉన్న దుకాణదరులు మద్యం అమ్ముతున్నట్లు ఎక్కువగా వదంతులు వస్తున్నాయని అటువంటి చర్యలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డీన్ పేర్కొన్నారు. పీజీ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఆరుగురు విద్యార్థులను మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఐకార్ ప్రకటించిన ఫలితాల్లో కళాశాలకు చెందిన ప్రియాంక అనే విద్యార్థినికి దేశ వ్యాప్తంగా 3వ ర్యాంకు వచ్చిందని, ఒబిసి టగిరీలో సాయి దీప్తి అనే విద్యార్థినికి 22వ ర్యాంకు, షర్మిల అనే విద్యార్థినికి 42వ బ్యాంకు, ఎస్సి కేటగిరీలో షకీనా అనే విద్యార్థినికి 43వ ర్యాంకు, హర్షవర్ధన్ అనే విద్యార్థికి 81వ ర్యాంకు, ఎస్టి కేటగిరీలో నితిన్ అనే విద్యార్థికి 24వ ర్యాంకు వచ్చిందని పేర్కొన్నారు. తద్వారా పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంకు మంచి పేరు తీసుకువచ్చారని అన్నారు. రాబోయే సంవత్సరంలో ఇటువంటి పోటీ పరీక్షల్లో మరింత మంది విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు. పాల్గొన్నారు.

పగిలిన మ్యాన్ హోల్ మూత - పట్టని అధికారులు

ప్రజాశక్తి -పులివెందుల టౌన్



ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

మ్యాన్ హోల్ పగిలినా సంబంధితాధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బ్రాహ్మణపల్లి రోడ్డు సుంకులమ్మ గుడి దగ్గర ఎస్‌బిఐ కాలనీ సచివాలయం సమీపంలో నడిరోడ్డు పైన మ్యాన్ హోల్ పగలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రమాద సూచికంగా కొందరు మ్యాన్‌హోల్ వద్ద చెట్టు కొమ్మను ఏర్పాటు చేశారు. సమీపంలోనే వార్డు సచివాలయం ఉంది. కనీసం సచివాల సిబ్బంది కూడా ఈ ప్రమాదకర స్థలాన్ని పటించుకోకపోవడం దారుణమని పలువురు వాపోతు న్నారు. ప్రమాదాలు జరగక ముందే మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-లింగాల : పశువులలో గర్భకోస వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించి పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రవీంద్ర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామనూతనపల్లిలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ పశుగ్రామీనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గర్భకోశ వ్యాధులపై చికిత్స అందించారు. 49 దూడలకు ఏలికపాము మందులను అందించారు. 52 మంది రైతులకు మినరల్ బ్లాక్, ఎముకలపొడి, కాల్షియం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శివరామిరెడ్డి డి.ఎ.ల్ డిఎ, మంగేష్, సుబ్బారాయుడు పారా సిబ్బంది పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ప్రొద్దుటూరులోని బొల్లరం నుండి యానాది కాలానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నదని ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం గతుకుల రోడ్డును డివైఎఫ్ఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ బొల్లారం నుంచి యానాది కాలనీకి వెళ్లే దారి గుంతలు పడి ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉందని చెప్పారు. రోడ్డు గతుకులమయంగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నాయని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని కోరారు.

నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-కాశినాయన : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టినస్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ ఉద్యోగులు, డీలర్లు కలిసి మండలంలోని 22 చౌకదు కాణాల పరిధిలోని గ్రామాల్లోని లబ్ధిదారులకు బుధవారం నుంచి పంపిణీ చేస్తారని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీతహశీల్దార్ రవిశంకర్ తెలిపారు. మంగళ వారం తహశీల్దార్ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డుల నూతన మిషన్‌లో డీలర్ల ఆధార్ మ్యాపింగ్, ఐరీష్ కార్డుల డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమంపై డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు ప్రతి లబ్దిదారునికి సచివాలయ ఉద్యోగులు డీలర్లతో కలిసి ఇంటింటికివెళ్లి పంపిణీ చేస్తారన్నారు.ఎవరైనా వీరువచ్చినప్పుడు గ్రామంలోలేకుండా బయటకు వెళ్లి ఉంటే మిగిలిన కార్డులు డీలర్ దగ్గం ఉంటాయని, అక్కడ వేలిముద్ర వేస తీసుకోవచ్చున్నారు. అందరికి నిత్యావసర వస్తువులు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, డీలర్లుబ ాలస్వామీ, జమాలయ్య, పొలయ్య, బాలయ్య, పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కొండాపురం : మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రకటన లోతెలిపారు. ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు పక్కన ఉన్న పులివెందుల, తాడిపత్రి వరకు వెళుతున్నారని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నా, కొత్త ఆధార్ ఏర్పాటు చేసుకోవాలన్న చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వ్యయ ప్రయాసాలతో పులివెందుల, తాడిపత్రికి వెళ్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి కొండాపురం మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని, లేకపోతే ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తామని ఆయన తెలిపారు.

ఆలయ పరిసరాలను శుభ్రపరచాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : దేవి నవరాత్రుల దసరా ఉత్సవాలు పురస్కరించుకొని పలు ప్రాంతాల నుంచి ప్రొద్దుటూరుకు విచ్చేసే వారికి ఇబ్బందులు కల్గకుండా ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కు మంగళవారం ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ భాషా మాట్లాడుతూ ప్రజలకు, భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ పరిసర ప్రాంతాలలో రెండు పూటలా శుభ్రపరచాలన్నారు. అకాల వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్పందించిన కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు.

మైదుకూరు మున్సిపాల్టీని

వెంటాడుతున్న డ్రెయినేజీ సమస్య

- రోడ్లపైనే మురుగు, వర్షపు నీరు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు
- పరిష్కారానికి చొరవ చూపని అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీని ప్రధానంగా డ్రెయినేజీ, సిమెంట్ రోడ్ల సమస్య వెంటాడుతోంది. మున్సిపాల్టీ ఏర్పడినప్పటి నుండి డ్రెయినేజీ సమస్య అధికంగా కనిపిస్తుంది .దీనిని పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. వర్షాకాలంలో నంద్యాల రోడ్డు, కడప రోడ్డు లోని ఆర్‌టిసి బస్టాండ్ వరకు నీరు పూర్తిగా రోడ్లపైనే ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుంది. వనిపెంట రోడ్డులో విజయ్ సినిమా థియేటర్ - అంకాలమ్మ ఆలయం మధ్య వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు చెరువుకు సంబంధించిన కాలువ పూర్తిగా ఆక్రమణలకు గురైంది. దీంతో మోస్తరు పడినా నీరు రోడ్డు పైకి చేరుతుంది. 24 వార్డులలో ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు వేయడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తోంది. పట్టణంలో బద్వేల్ రోడ్డు, కడప రోడ్డు తక్కువ కాలంలో అభివృద్ధి చెందుతూ ఎక్కువ గృహాలు నిర్మిస్తున్నారు. అయినప్పటికీ ఈ కాలనీలను అభివృద్ధి పరచడంలో మాత్రం పాలకులు, అధికారులు వెనుకంజలో ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం, గొల్లపల్లె, శాంతినగర్, జోసఫ్‌పేట బద్వేల్‌రోడ్డులోని మహబూబ్ నగర్, ప్రొద్దుటూరు రోడ్డులోని మూల బాట వీధి, సంత రోడ్డు, మార్కెట్ నుండి సాయిబాబా




వనిపెంట రోడ్డులో చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

గుడి తదితర కాలనీల్లోని ప్రజలు డ్రెయినేజీ సమస్యతో నానా అవస్థలు పడుతున్నారు. కడప రోడ్డులోని సర్వాయి పల్లె రోడ్డులో మురుగు నీరు అధికంగా చేరి దుర్వాసన వెదజల్లుతుంది. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయిస్తున్న వాటిని సద్వినియోగం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. పైగా మున్సిపాలిటీ పరిధిలో అవినీతి ఎక్కువగా చోటుచేసుకుంటుందనే విమర్శలూ లేకపోలేదు. నివారించడంలో కూడా అధికార పార్టీలు నాయకులు, అధికారులు వైఫల్యం చెందారు. గత పాలకవర్గ సమయంలో మరుగుదొడ్ల నిర్మాణం, సిమెంట్ రోడ్ల ఏర్పాటులో రూ.1 కోటి వరకు అవినీతి చోటు చేసుకోవడంతో అధికారులు కటకటాల పాలైన సంఘటనలున్నాయి. .ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం మున్సిపాల్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రకటిస్తున్నా ఆచరణలో కనపడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కెసి, కుందూ పరిధిలో పంటల కళకళ



చాపాడులో సాగులో ఉన్న పసుపు, వరి పంటలు



ప్రజాశక్తి - చాపాడు

కెసి, కుందూ నది పరివాహక ప్రాంతంలో ప్రస్తుతం వరి, పసుపు ఇతర కూరగాయల పంటలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో సకాలంలో వర్షాలు పడటంతో పాటు తరువాత ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్ల కుందూ నదిలో, కెసి కాలువలో నీరు సమృద్ధిగా ప్రవహిస్తుంది. మండల పరిధిలో ఖరీఫ్‌లో 13700 ఎకరాలలో వరి పంట, 140 ఎకరాలలో పసుపు, 200 ఎకరాలలో ఇతర పంటలు సాగయ్యాయి. ముందస్తుగా సాగైన వరి పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు రెండవ దఫా సతవలు చల్లుతున్నారు. కొంత మంది రైతులు వరి సాగు చేపడుతున్నారు. పసుపు పంట మాత్రం ఈ ఏడాది అధిక వర్షాలతో తేమ శాతం ఎక్కువగా ఉందని రైతులు పేర్కొం టున్నారు. ఈ ఏడాది రైతులు వరి, పసుపుతో పాటు కూరగాయల సాగు పై ఆసక్తి కనబరుస్తున్నారు. బీర, కాకర తదితర పంటలను కూడా సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- ఖాజీపేట : ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ మాజీ చైర్మన్ ఇట్టేం శ్రీరాముల యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ సేవలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ వివిధ అనారోగ్య సమస్యలకు చికిత్స పొందవచ్చును అన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహాలక్ష్మి, మాధవి, ఎంపిహెచ్ ఇఒ పెంచల్ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **మైదుకూరు రూరల్ :** మహిళలకు వరం స్వస్థ నారి సశక్తి పరివార్ పథమని ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు యాపరాల చిన్న, మోపూరు రమణ, మాచనూరు సుబ్బరాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోత్స్నారెడ్డి ఆధ్వర్యంలో స్వస్థ నారి సశక్తి పరివార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చెడిపోయిన పదార్థాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్

చెడిపోయిన పదార్థాలు అమ్మితే బేకరీ యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత అన్నారు. పట్టణంలోని బెస్ట్ బేకరీ యాజమాన్యం చెడిపోయిన కేకులు అమ్ముతున్నారని ఆరోపణలు రావడంతో మంగళవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ రాముడు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేకరీలో ఉన్న అన్ని పదార్థాలను టెస్టింగ్ కోసం ల్యాబ్ కు పంపామని చెప్పారు. ల్యాబ్ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా బేకరీ పై చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సులు లేకుండా బేకరీలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్సు లేకుండా ఎవరైనా బేకరీలు నడుపుతుంటే వెంటనే లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయిలో పరిశీలన సాధ్యమవడం లేదని తెలిపారు. బేకరీ యజమానులు శుభ్రత పాటించి మంచి ఆహారాన్ని ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటరీ సెక్రెటరీ నటరాజ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వలో పడి ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



పట్టణంలోని కన్నెలూరులో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు పోసా మధు బాబు ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. మధు బాబు పెద్ద మొడియం మండలం జె. కొట్టాలపల్లె గ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సోమవారం నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో రాత్రి ఇంటికి చేరుకొనే క్రమంలో కన్నెలూరు ప్రధాన కాలువలో పడిపోయారు. ఎవరు గమనించక పోవడంతో మంగళవారం ఉదయం కాలువలో మృత్యదేహం బయటపడింది. మృతదేహాన్ని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య రాజేశ్వరి ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ గా ముద్దనూరు బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు న్నారు. ఆయన మృతికి వివిధ ఉపా ధ్యాయ సంఘాల నాయకులు, స్నే హితులు, బంధువులు నివాళు లు అర్పిం చారు. గడియారం సాహితీ సంఘం ఆధ్వర్యంలో ప్రగాఢ సానుభూతిని తెలి పారు.

లోకేష్ ప్రకటన పట్ల హర్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలోని లైబ్రరీలను ఆధునీకరణ దిశగా తీసుకెళ్తమని రాష్ట్ర విద్యా, గ్రంథాలయాల శాఖ మంత్రి నారా లోకేష్ శాసన సభలో ప్రకటించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి.రాంబాబు, నాదెండ్ల బాబ్జీ హర్షం వ్యక్తం చేశారు. శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయంలో మండలి బుద్ధప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యేసింధూరరెడ్డి లైబ్రరీ అభివృధి కోసం అడిగిన పలు ప్రశ్నలకు సమాధానంగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ 175 నియోజకవర్గాల్లో మోడల్ లైబ్రరీల నిర్మాణం 24 నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పడం హర్షనీయమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి 13 జిల్లాలో పనిచేస్తున్న గ్రంథాలయాలను 26 జిల్లాలకు విస్తరింప చేస్తున్నామని ప్రకటించాలని చెప్పారు. గ్రంథాలయాల ఆధునీకరణ తో పాటు పాఠకులకు అనుకూలమైన లైబ్రరీ సమయాలకు మార్పు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న లైబ్రేరియన్స్ ఉద్యోగోన్నతుల సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప

కడప రిమ్స్ ఫార్మకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం విఆర్ఆర్ఎం కళాశాలలో విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. క్విజ గెలుపొందిన విద్యార్థులు జయపతి, శ్రీ లలిత, పద్మావతికి ప్రిన్సిపల్ బహుమతులు అందజేశారు. ఫార్మకోవికాలజీ వీక్ సందర్భంగా ప్రజలలో ఔషధాల దుష్ప్రచారాల గురించి వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లో విద్యార్థులకు క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు.

షాహినాజ్ బేగంకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అప్లయిడ్ మ్యాథమెటిక్స్ స్కాలర్ వి.షాహినాజ్ బేగంకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ఆ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో 'నానోఫ్లూయిడ్‌ల ఉష్ణప్రసరణ ఉష్ణ బదిలీపై స్నిగ్ధత, క్రియాశీలత శక్తి ప్రభావం' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్టు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె.ఎస్.వి.కృష్ణారావు తెలిపారు. ఈమె రాసిన ఐదు పరిశోధన పత్రాలు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ కేర్ లిస్టులో ప్రచురితమయ్యాయి. స్కాలర్ షాహినాజ్ బేగంను ఈ సందర్భంగా వైవీయూ విసి ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అభినందించారు.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM

O.S.No. 91/2022

1) Sanepalle Chenna Reddy
2) Sanepalle @ Kummara Vara Laskhmi
3) Nandaluru Anuradha
4) Sanepalle Chennamma. ...Plaintiffs

Vs

D2) Seelam Sarojamma, wife of Chenna Reddy, aged about 57 years, Hindu, Housewife, Residing at Flat No. 103, Keerthi Park view Apartment, Opp. Rajiv Park, Kadapa City, YSR Kadapa District. ...Defendant No.2

SUMMON

పై నెంబరు దావాలోని 2వ ప్రతివాది అయిన నీకు దావా సమను తీసుకొనుటకు రాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వు చేసివున్నారు. అట్టి ఉత్తర్వు మేరకు నీవు గాని మీ వకీలు ద్వారా గాని రాజశ్రీ కోర్టు యెదుట హాజరు ఆగుటకు 08. 10.2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసివున్నారు. నీకు ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలసినది, లేని యెడల రాజశ్రీ కోర్టు వారు నిన్ను పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 08.10.2025
స్థలము: కమలాపురం

పి.ఎస్. రంగారెడ్డి
వాది తరపున న్యాయవాది, ప్రొద్దుటూరు.

శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము (శివాలయం)

ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వై.యస్.ఆర్. జిల్లా.

ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనరు వారి ఉత్తర్వులకు లోబడి దేవస్థానమునకు అవసరమగు సిబ్బందిని హిందూ మతమునకు చెందిన వారిని ఔట్ సోర్సింగ్ పద్ధతి పై 15.10.2025 నుండి 14.10.2026 వరకు నియమించుకొనుటకు అనుభవము కలిగిన రిజిస్టర్ ఏజెన్సీల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. నెలసరి చెల్లించవలసిన రెమ్యునరేషన్ ప్రభుత్వమునకు చెల్లించు ట్యాక్సులతో కలిపి ఏజెన్సీ వారు టెండరు నందు కనపరచవలెయును.

వ.సం.	పోస్ట్ పేరు	అవసరమగు పోస్టుల సంఖ్య	నెలసరి రెమ్యునరేషన్ రూ.	అర్హతలు	ఇతరములు
1	కంప్యూటర్ ఆపరేటర్/డేటా ఎంట్రీ ఆపరేటర్	1	నెలకు రూ.18500/- వరకు	డిగ్రీ పీజీడిసీఏ	అర్హతగల సర్టిఫికెట్ జతపరచవలెను.

ఆసక్తి గల ఏజెన్సీలు 10.10.2025వ తేదీ లోపల సంబంధిత అర్హత పత్రములతో కూడిన దరఖాస్తులు కార్యనిర్వహణాధికారి, శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానము, ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్. కడప జిల్లా వారికి కార్యాలయము పనివేలలో నేరుగా కాని/ పోస్టు ద్వారా కాని కొటేషన్లు పంపుకోవచ్చును.

సహాయ కమీషనరు/ కార్యనిర్వహణాధికారి

OFFICE OF THE ADDL. DME/ SEPURINTENDENT, GOVT. GENERAL HOSPITAL, YSR DISTRICT, KADAPA

R.C.No.2434/G2/2025, Dated: 23.09.2025

TENDER NOTIFICATION

Sealed Tenders are invited from the reputed agencies for Annual Maintenance & Service contract (AMC) for AC's for a period of one (1) year in various departments of O.P. Block & I.P Block at Government General Hospital, Kadapa.

DETAILS OF ACs FOR AMC

Sl.No.	Type of ACs	Capacity of ACs in Tons	Quantity
1	Split ACs	2	137
2	Ductable ACs 7.5 TR	7.5	15
3	Modular OT Ductable	24	8
4	Ductable 11 TR	11	4
	TOTAL		164

The Tender application forms and list of items along with terms and conditions can be obtained from the office of the Superintendent, Govt. General Hospital, Kadapa from 23.09.2025 to. 01.10.2025 on payment of Rs. 1,000/- by way of Demand Draft in favor of Convenor, HDS, Govt. General Hospital, Kadapa in person on working days from 10.30 AM to 5 PM. Further details, have been uploaded in the District Official website www.kadapa.ap.gov.in (Notices->Tenders).

Dates for sale of Tender application Forms : 23.09.2025 to 01.10.2025
Last date for receipt of Tender application : 01.10.2025 by 5 PM
Date and Time for opening the Tenders : 03.10.2025 at 10:30 AM
Venue for opening the sealed Tenders : JC Chamber

Addl. DME/ Superintendent, Govt. General Hospital, Kadapa.
Sd/- Joint Collector/Chairman, District Purchase Committee, Kadapa.



కంది పంట పరిశీలిస్తున్న అధికారులు

ప్రతి రైతూ ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా పంట నమోదు చేసుకుని ఇకెవైసి చేయించుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ మోహన్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కమ్మవారిపల్లెలో మంగళవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నమోదు చేసుకోకుంటే ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందించే పథకాలు వర్తించవన్నారు. కంది పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతిని అరికట్టేందుకు వేప నూనె 5 ఎం.ఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులకు జిప్సం అందుబాటులో ఉందన్నారు. అనవసరంగా ఎరువులు వాడకూడదని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూమి సారవంతం కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో విఎఎ శిరీష, ఆత్మ బిటిఎం రవి కుమార్‌రెడ్డి ,రైతులు పాల్గొన్నారు.

గులాంగిరి చేస్తే జైలుకు పంపుతా : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రభుత్వ అధికారులు రాజ్యాంగేతర శక్తులకు గులాంగిరి చేస్తే 2029 అనంతరం జైలుకు పంపుతానని మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నీతి కథలు బోధించే మూడు కోతుల ఫొటోలతో పాటు ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు ఇ.వి. సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యే వరదరాజురెడ్డి తనయుడు, టిడిపి నాయకులు కొండారెడ్డి ఫొటోలు ఏర్పాటు చేసి విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రజలు ఓట్లేసి ఎమ్మెల్యేగా వరదరాజు రెడ్డిని ఎన్నుకున్నారని ఃఅన్నారు. అలాంటిది ప్రభుత్వ కార్యక్రమాల్లో కొండారెడ్డి పాలుపంచుకోవడమేంటని ప్రశ్నించానన్నారు. ఇది ప్రజలు వేసిన ఓటును అగౌరవపరచడమే అన్నారు. పైగా ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తాను అని కొండారెడ్డి చెప్పడం దారుణమన్నారు. ఆయన మాటలను సుధాకర్ రెడ్డి, బచ్చల పుల్లయ్య సమర్ధించడం ఎంతవరకు సబబని, సమాజానికి ఏమి సందేశం ఇస్తున్నారని అని ప్రశ్నించారు,. తెలుగుదేశం పార్టీ గెలిచినప్పుడే కొండారెడ్డి ప్రొద్దుటూరులో ఉంటారని, ఓడితే హైదరాబాదులో ఉంటూ వ్యాపారం చేసుకుంటారని, తాను మాత్రం గెలిచినా ఓడినా ప్రొద్దుటూరులోనే ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని రాచమల్లు పేర్కొన్నారు. సిఎం అర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసే అధికారం కొండారెడ్డికి ఎక్కడిది అని రాచమల్లు ప్రశ్నించారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవలోనే ఉండాలని రాజమల్లు హితవు పలికారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి

స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు : ముద్దనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సొంత భవనం ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వ స్థలం కేటాయించాలని సంఘం చైర్మన్ రాజుల సురేంద్ర నాధ్ రెడ్డి కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సురేంద్రనాధ్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం సిఇఒ రత్నం డిప్యూటీ తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 1963లో ప్రారంభమైందన్నారు. ఈ సంఘం ద్వారా మండలం లోని రైతులకు రుణాలు మంజూరు చేసి ఎన్నో సేవలు అందిస్తూ చేయూత నిస్తున్నట్లు చెప్పారు. సంఘానికి సొంత భవనం లేక నేటికి అద్దె భవనంలో కార్యకలాపాలు సాగిస్తున్నామని చెప్పారు. రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందించేందుకు ఎరువుల వ్యాపారం సాగించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం కేటాయిస్తే సొంత భవనం ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు సాగిస్తూ అన్నదాతలకు అండగా ఉంటామని సురేంద్రనాధ్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో శంకర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,వెంకట కృష్ణారెడ్డి, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించొద్దు

ప్రజాశక్తి - బద్వేలు : ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లింగప్ప పట్టణంలోని బస్సు ట్రావెల్స్ యజమానులకు, లాడ్జిల యజమానులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. బస్సులను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ (ప్రత్యేకించి 4 రోడ్ల సెంటర్లో) నిలబెట్టకుండ ఒక పక్క నిలుపుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చూసు కోవాలని చెప్పారు. లేకపోతే భారీ జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. లాడ్జిల లో వచ్చిపోయే వ్యక్తుల వివరాలు సరిగ్గా పొందుపరచాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం కల్పించరాదని, లేకపోతే లాడ్జి యజమానులు పోలీస్ వారు తీసుకునే చర్యలకు బాధ్యులగుదురని తెలియజేశారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 241/2025 in O.S.No.97/2025
I.A.No.240/2025 in O.S.No.97/2025
O.S.No. 97/2025

వీరంరెడ్డి ఓబులమ్మ, W/o వి.నరసింహారెడ్డి, 74 సం॥, గృహిణి, డోర్‌నెం.15/84, శ్రీనివాసపురం, గోపవరం పంచాయతి, ప్రొద్దుటూరు మం॥, వైయస్ఆర్ కడప జిల్లా. ...వాది

Vs

సిరివెల్ల సుబ్బిరెడ్డి died his L.Rs
1. సిరివెల్ల గంగాదేవి, W/o కీ॥శే॥ సిరివెల్ల సుబ్బిరెడ్డి, 28 సం॥, జనరల్ స్టోర్,
2. సిరివెల్ల వీరనాగార్జున రెడ్డి, S/o కీ॥శే॥ సిరివెల్ల సుబ్బిరెడ్డి, 9సం॥,మైనరు,Represented by Natural guardian తల్లి అయిన పైన కనిన 1వ ప్రతివాది, ఇద్దరి నివాసం డోర్ నెం.10/555, కోనేటి కాల్వవీధి, ప్రొద్దుటూరు టౌన్, వైయస్ ఆర్ కడప జిల్లా. ...ప్రతివాదులు

సమన్లు మరియు నోటీసులు

పైన కనిన వాది, ప్రతివాదులపై దావా బాకీ రాబట్టుటకు పై నెంబరు దావా వేసియున్నారు. కావున ప్రతివాదులు 8. 10.2025వ తేదీన ఉదయం10.30 గం॥లకు పై కోర్టులో నేరుగా హాజరై లేక మీ వకీలు ద్వారా కేసు నడిపించుకోవలెను. లేనంతట పరోక్షంగా పై O.S., I.A.లు మీ పై తీర్మానించబడును. మరియు క్రింది దాఖలా ఆస్థి దావా బకీకి గాను I.A.No.241/2025లో జప్తు చేయబడును.

షెడ్యూలు

కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రస్తుతం కడప రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కోనేటి కాల్వ వీధిలోని Old. D.No.10/350, New D.No.10/556, R.C.C.House City Upstair Bounded by
తూర్పు: పబ్లిక్ రస్తా, పడమర: రాశిగోడ మరియు నల్ల శివ శంకర్ ఇల్లు, ఉత్తరం: రాశిగోడ మరియు రాశి తాపలు మరియు మన్నె చాముండేశ్వరి ఇల్లు, దక్షిణం: రాశిగోడ మరియు వి.సుబ్రమణ్యం ఆచారి ఇల్లు. ఈ హద్దుల లోగా తూర్పు–పడమర 40 1/2 అ॥ లేక 12.344 మీ॥, ఉత్తరం–దక్షిణం 9 1/2 అ॥ లేక 2.896 మీ॥ ఈ కొలతలలోగా ఆర్‌సిసి ఇల్లు కొలతలు 40x9 1/2=380 చ॥మీ॥ మరియు Upstair A.C.C. Sheets House కొలతలు 20x9=180 చ॥మీ॥ With all Casementary rights, కరెంటు మీటరు మరియు Deposits పడమర, ఉత్తరం, మరియు దక్షిణం రాశిగోడల సహా, రాశి తాపల హక్కులతో సహా.

వాయిదా : 08.10.2025

//By Order of the Court//

బి.వి.రమణా రెడ్డి
అడ్వకేట్, ప్రొద్దుటూరు.